క్లుప్తంగా

6న వినుకొండలో జాబ్‌మేళా

వినుకొండ(నూజెండ్ల): డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అధికారి ఈ.తమ్మాజీరావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 5 కంపెనీలు పాల్గొంటాయని, ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా ఫార్మసీ, పీజీ వరకు చదువుకున్న 18 నుంచి 35 సంవత్సరాల నిరుద్యోగులు తమ బయోడేటా, సర్టిఫికెట్స్ జిరాక్స్‌తో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 99512 14919, 7288059665 నంబర్లను సంప్రదించాలన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): స్థానిక నరసరావుపేట రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీవీ సురేష్, సంఘ సభ్యులు బి. సుబ్రహ్మణ్యం, కాళ్ల కృష్ణమూర్తి, జి. నాగేంద్రుడు, సామ్రాజ్యలక్ష్మీ, సుందరరావు, ఎ.కోటేశ్వరరావు, వై.వి. సుబ్బయ్యశర్మ, శేషయ్య, రాఘవయ్య, దుబ్బల దాసు, గోపి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం



శావల్యాపురం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామసభను నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి బోడ్డు యాకోబు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య పాల్గొని మాట్లాడుతూ పంచాయతీ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సర్పంచులు, వార్డు సభ్యులు కీలకపాత్ర పోషించాలన్నారు. పంచాయతీ నిధులు రూ. 6లక్షల వ్యయంతో శావల్యాపురంలో మంచినీటి పథకం మరమ్మతులు, ట్యాంకు రిపేరు, స్వచ్ఛ భారత్ పథకం చెత్త సంపద కేంద్రం వినియోగంలోకి తేవటం, గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు కుక్కలను పట్టించటం తదితర వాటికి తీర్మానం చేసినట్లు కార్యదర్శి యాకోబు తెలిపారు. ఈగ్రామసభలో సర్పంచ్ చెన్నమ్మ తదితరులు ఉన్నారు.

వడ్డెరుల ముద్దుబిడ్డ వడ్డే ఓబన్న



వినుకొండ(నూజెండ్ల): వడ్డెరుల ముద్దుబిడ్డ, దేశ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న అని ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో వినుకొండ నియోజకవర్గ వడియరాజులు ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో వడియరాజుల సంఘం అధ్యక్షులు పల్లపు వెంకటేశ్వర్లు, నాయకులు దేవళ్ల ప్రసాద్, బత్తుల నరసింహారావు, బత్తుల బాలరాజు, దేవళ్ల ప్రసాద్, బత్తుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభ జయప్రదం చేయాలి



చిలకలూరిపేట: విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల ఐదో తేదీన నిర్వహిస్తున్న హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని పరిషత్ సభ్యుడు పోలూరి శ్యామోహన్‌రావు కోరారు. విశ్వహిందు పరిషత్ సభ్యులు శుక్రవారం బహిరంగ సభ విషయమై పట్టణంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పరిషత్ సభ్యులు వెల్లంపల్లి శ్రీరాములు, తోట బ్రహ్మస్వాములు, సీతారామాంజనేయులు, నాగేశ్వరరావు, బాలగురునాథం గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

వినుకొండ(నూజెండ్ల): మండల పరిధిలోని ఉప్పరపాలెంలో వినుకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అనధికారికంగా గొలుసు దుకాణం నిర్వహిస్తున్న ఒక మహిళను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి డ్యూటీ పెయిడ్ లిక్కర్ 12 బాటిళ్లను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు.

మంచుకురిసే వేళలో...



లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్న వాహనాలు



ఉదయం 8 గంటల వేళ పొగమంచు ఇలా...

మండలంలో రోజురోజుకు మంచు తీవ్రత పెరుగుతోంది. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు దట్టంగా మంచు ఆవరించటంతో హైవేపై రాకపోకలు సాగించటం వాహన చోదకులకు కష్ట తరమైంది. 9 గంటల వరకు సూర్య భగవానుడి కిరణాలు కూడా దట్టమైన మంచులో ప్రసరించటం లేదు. వాహనాల ప్రయాణానికి మంచు తీవ్ర ఆటంకం కలిగిస్తుండటంతో కొందరు వాహనదారులు తమ వాహనాలను రోడ్డు పక్కనే లైట్లు వెలిగించి పార్కింగ్ చేసుకున్నారు. కొన్ని వాహనాలు తక్కువ వేగంతో హెడ్‌లైట్ల వెలుతురులో ప్రయాణం సాగించారు. దీని వల్ల రాకపోకల సమయం పెరిగి పోవటంతో పాటు నిర్ణీత సమయంలో గమ్యాలకు చేరుకోలేక పోతున్నామని వాహన చోదకులు తెలిపారు.

–రొంపిచర్ల

అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్



మాట్లాడుతున్న మారుతీ వరప్రసాద్

చిలకలూరిపేట: అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వర ప్రసాద్ కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే పట్టణ ప్రజలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంత ప్రజలకు మూడు సెంట్లు స్థలం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిన విషయం గుర్తు చేశారు. దీంతో పాటుగా ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు తామే భరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 10వ తేదీన తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు, సహాయ కార్యదర్శి ధనరాజ్, ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఏఐవైఎఫ్ జిల్లా ఇన్‌చార్జి షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

పల్లెవాసులు ఐకమత్యంగా మెలగాలి

- యడ్లపాడు ఎస్‌ఐ బాలకృష్ణ
- కారుచోలలో పోలీసుల పల్లెనిద్ర

యడ్లపాడు: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కుటుంబాలు నాశనం అవుతాయని యడ్లపాడు ఎస్ఐ వి.బాలకృష్ణ చెప్పారు. మండలంలోని కారుచోల గ్రామంలో గురువారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధుల్లో పర్యటించి ప్రజల సమస్యల్ని తెలుసుకున్నారు. అనంతరం చట్టాలపై గ్రామస్తులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మానవ అక్రమ రవాణ గురించి తెలిస్తే సత్వరమే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళలపై జరిగే నేరాలు, నేరాల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలు తెలిపారు. గ్రామాల్లో చిన్నపాటి వివాదాలు, గొడవలు జరిగితే సావధానంగా పరిష్కరించేందుకు పెద్దలు కృషి చేయాలని కోరారు. ఐకమత్యంతో ఉండాలని, గ్రామస్తుల ద్వారా పరిష్కారం కాని విషయాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి, ఎంఐఎం నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీతో ఎంఐఎం పార్టీకు మొదటి నుంచి అవినాభావన సంబంధం ఉందని, రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీతో కలిసి ఆ పార్టీ నాయకులు ప్రజాపోరాటాలకు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తన గృహంలో ఎంఐఎం పార్టీ పట్టణ కమిటీ నూతన కమిటీ రూపొందించిన నూతన ఏడాది క్యాలెండర్‌ను ఆ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మొదటినుంచి దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి ఎంఐఎం అధినేత అసదుద్దీన్‌ఒవైసీ కుటుంబనీకి మంచి సత్సంబంధాలున్నాయని అన్నారు. అలానే ఆయన నాలుగుశాతం రిజర్వేషన్ అమలు చేయటంలో ఒవైసీ, రాజశేఖరరెడ్డి ఇద్దరు కీలకపాత్ర పోషించారన్నారు. అదే అభిమానంతో 2014, 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి బహిరంగగానే మద్దతు పలికారన్నారు. ఒవైసీ మాట ప్రకారం ఆ పార్టీ నాయకులు తమ పార్టీకి మద్దతుగా ఉన్నారని పేర్కొన్నారు. ఎంఐఎం జిల్లా అధ్యక్షులు షేక్ కరీముల్లా, పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలి



జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

నరసరావుపేట రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకి సిద్ధం కావాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు పిలుపునిచ్చారు. సీపీఐ వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా బ్రిడ్జి సెంటర్‌లో సీపీఐ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో బడుగు, బలహీన వర్గాల కోసం భారత కమ్యూనిస్టు పార్టీ ఎనలేని పోరాటాలు చేసిందని తెలిపారు. కేరళ, పశ్చిమ బెంగాల్లో అదే విధంగా తెలంగాణ సాయిధ పోరాటంలో సీపీఐ ముందుండి పోరాటాలు నడిపిందని గుర్తుచేశారు. రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువకులు, మహిళల కోసం గొంతు ఎత్తి పోరాటాలు చేయగల సత్తా కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. ఈ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేసినటు వంటి చరిత్ర సీపీఐకే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, ప్రజా నాట్యమండలి కార్యదర్శి ఎస్‌కె చిన్న జాను సైదా, పెద్ద సైదా మస్తాన్ పాల్గొన్నారు.

మద్దతు ధరకే కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న రాము

శావల్యాపురం: రైతు పండించిన వరి పంటను చివరి గింజ వరకు ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సీపీఐ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పోట్లూరు గ్రామంలో వరి పంట సాగు రైతులతో మాట్లాడి రైతుసేవా కేంద్రాన్ని సందర్శించారు. రైతుసేవా కేంద్రాల ద్వారా రంగు మారిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని, ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో సడలింపులు ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ఆర్థికంగా నష్టపోకుండా భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో వినుకొండ నియోజకర్గంలో అరుగాలం సాగు చేసిన పొలాల్లో మిర్చి, పొగాకు ఉత్పత్తులను దొంగతనాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. సీపీఐ రైతులకు అండగా ఉంటుందని ఏమైనా సమస్యలు ఉంటే సత్వరమే స్పందిస్తామన్నారు. ఆయనతో పాటు రైతులు బోయపాటి యోగేశ్వరరావు, గోనుగుంట్ల శ్రీనివాసరావు, అంజయ్య, సాంబయ్య, ఏడుకొండలు ఉన్నారు.

సేకరించిన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

రైతు సంఘం నాయకుల డిమాండ్

నరసరావుపేట: సిమెంట్ కంపెనీలు సేకరించిన భూముల్లో పరిశ్రమలు వెంటనే ప్రారంభించాలని రైతు సంఘ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోటప్పకొండ రోడ్డులోని సంఘ కార్యాలయంలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. కంపెనీలు ప్రారంభించే వరకు రైతులకు సాగుకు అవకాశం ఇవ్వాలని, నడుస్తున్న పరిశ్రమల్లో భూములు సేకరించిన రైతు కుటుంబాల్లో ప్రతి ఒక్కరికి శాశ్వత ఉద్యోగం ఇవ్వాలని, భూములు ఇచ్చిన గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు సిమెంటు యాజమాన్యాలు కృషిచేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కేసీపీ, సాగర్, శ్రీ చక్ర, చెట్టినాడు, భవ్య, శ్రీ సిమెంటు పరాశక్తి, సిమెంటు కంపెనీలు ఉత్పత్తి సాగిస్తున్నాయి. ఈ కంపెనీలన్నీ, భూములు ఇచ్చిన రైతులకు నామ మాత్రపు ఉద్యోగ అవకాశాలు కల్పించి, ఈ ప్రాంతం నుంచి వందల కోట్ల రూపాయల లాభాలను దండు కుంటున్నాయన్నారు.
మరికొన్ని కంపెనీలు పరిశ్రమలు స్థాపిస్తామని భూములు తీసుకొని వాటిని మొదలు పెట్టలేదు అన్నారు. పాలకులు ఎన్నికల సందర్భంగా పరిశ్రమలు తీసుకొచ్చి, అందరికీ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని నమ్మి ఓట్లు వేయించుకొని, గద్దెనెక్కిన అనంతరం కంపెనీల దగ్గర ముడుపులతో కాలం వెళ్లదీస్తూ, ఈ ప్రాంత అభివృద్ధి, ప్రజల ఉపాధిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.

బాలికల హక్కులు పరిరక్షించాలి



నాదెండ్ల: బాలికలకు మెరుగైన విద్య, వారి హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉషారాణి చెప్పారు. అమీన్ సాహెబ్‌పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలను విద్యావంతులుగా చేసి వారు జీవితంలో స్థిరపడేలా సహకరించాలన్నారు. బాల్య వివాహాలు నేరమని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కామినేని లలిత, హెచ్‌ఎం సునంద, నాగేశ్వరరావు, మాధవి, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



ఎంఈవోను సత్కరిస్తున్న దృశ్యం



నాదెండ్ల పాఠశాలలో...



చిలకలూరిపేటలో నివాళులు అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



మహిళా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గురులింగం



నరసరావుపేటలో పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీసీ సంఘీయులు

శావల్యాపురం: స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూల్లో జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సావిత్రి బాయి పూలే 194వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గోళ్ళమూడి రత్నకుమారి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 పుసులూరి లలితకుమారి పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఎంఈవో మాట్లాడుతూ భారతదేశంలోని తొలి ఉపాధ్యాయురాలుగా ప్రఖ్యాతి పొందిన మహిళ సావిత్రి బాయి పూలే అన్నారు. స్త్రీ విద్యకోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి అని, తొలి మహిళా పాఠశాలను ఏర్పాటు చేసిన ఘనత పూలే దంపతులకు దక్కిందన్నారు. సావిత్రిబాయి జీవితం ప్రతీ మహిళకు ఆదర్శప్రాయమన్నారు. అనంతరం ఎంఈవోను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: విద్యకు దూరంగా ఉంచిన బడుగు, బలహీన, అట్టడుగు వర్గాలకు విద్యను దరిచేర్చేందుకు తన జీవితాంతం కృషి చేసిన భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీబాయిపూలే అని ఐద్వా నాయకురాలు సీహెచ్ అమరమ్మ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ సౌజన్యంతో 193వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పదో తరగతి చదువుతున్న 50 మంది విద్యార్థులకు అమరమ్మ అందించిన ఆర్థికసాయంతో స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నిర్మల, ఐద్వా నాయకులు జగన్నాధమ్మ, శ్రీధర్‌బాబు, ఉపాధ్యాయులు రెడ్డియ్యచౌదరి పాల్గొన్నారు. సాతులూరు అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్‌సూపర్‌వైజర్ కె.పద్మ అధ్యక్షతన సావిత్రీబాయిపూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం సర్పంచ్ ముసుగు శోభారాణి విద్యార్థులకు పీపీ1, పీపీ2 పుస్తకాలు పంపిణీ చేశారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళలు చైతన్యవంతం కావాలని ప్రజా సంఘాల నాయకులు చెప్పారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో ఉన్న సావిత్రిబాయి పూలే, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు విద్య ద్వారానే చైతన్యం సాధించగలరని భావించి మహిళా విద్యాలయాలు ఏర్పాటు చేసిన ఘనత ఆమెకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల నాయకులు బి.శ్రీనునాయక్, బి.వెంకటేశ్వర్లు, ఎస్.రాజు, వి.ముత్తయ్య, ఎస్.రవి, ఎస్.ఆదినారాయణ, కె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని బీజేపీ నాయకులు ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజ హితానికి ఆమె అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కోటా పవన్ కుమార్, జిల్లా మాజీ అధ్యక్షుడు పోట్రు పూర్ణచంద్రరావు, పల్నాడు జిల్లా కార్యదర్శి కస్తూరి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ కన్వీనర్ తాటిపర్తి జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సత్కారం

నరసరావుపేట రూరల్: ఎస్ఆర్‌కేటీ కాలనీ ఎంపీపీ స్కూల్‌లో శుక్రవారం తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయ్ పూలే జయంతిని నిర్వహించారు. సావిత్రిబాయ్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు ఎ.గురులింగం, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులు ఫాతిమా రాణి, అపర్ణలను ఈ సందర్భంగా సత్కరించారు. సావిత్రిబాయ్ పూలే జీవిత విశేషాలను విద్యార్థులకు తెలియజేశారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట: సంఘసంస్కర్త, భారత దేశంలో తొలి మహిళా టీచర్‌గా సేవలందించిన సావిత్రిబాయిపూలే జయంతిని బీసీ సంఘీయులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలు చల్లి ఘనంగా నివాళులు అర్పించారు. ఏపీ రాష్ట్ర బొందిలి కార్యనిర్వాహక కార్యదర్శి బొందిలి శ్రీనివాససింగ్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే నిమ్నజాతి వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషిచేశారన్నారు. కులమతాలకు అతీతంగా సమాజాన్ని ప్రభావితం చేసి విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మి బాలిక విద్య ఉద్యమానికి పునాది వేసిన గొప్ప సంఘసంస్కర్తగా కొనియాడారు. రిటైర్డ్ ఎమ్డీవో దేవళ్ల వెంకటేశ్వరరావు, డి.ఖాసింపీరా, రావూరి కోటేశ్వరరావు, బత్తుల మురళి, లాటికా రాంబాబు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

నాదెండ్ల: మిర్చిలో సమగ్ర సస్యరక్షణ చర్యలతో మంచి దిగుబడులు సాధించవచ్చని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు చెప్పారు. సాతులూరులో మిర్చి సాగు చేస్తున్న రైతులకు ప్లాంట్ ప్రొటెక్షన్ కిట్లపై అవగాహన కల్పించారు. మిర్చి సాగులో రసాయనిక ఎరువుల పిచికారీ సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విచక్షణా రహితంగా పురుగుమందుల వాడకం నష్టాలు కలిగిస్తుందన్నారు. సరైన మోతాదులో ఎరువులు, పురుగుమందులు వినియోగించాలన్నారు.

రెవెన్యూ సదస్సుకు 14 అర్జీలు

నాదెండ్ల: చందవరం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం గ్రామ రెవిన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ఏవీ రమణ, మండల సర్వేయర్ రాంబాబు, డీటీ నీలి ధనలక్ష్మీ, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై 14 అర్జీలు అందాయి. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో అర్జీలు అందించేందుకు ఎలాంటి రుసులు చెల్లించాల్సిన అవసరం లేదని, అర్జీలను గడువు మేరకు పరిష్కరిస్తామని తెలిపారు.

సన్నిధి కుటుంబాన్ని పరామర్శించిన తహసీల్దార్



సన్నిధి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న తహసీల్దార్, అధికారులు

రొంపిచర్ల: మండలంలోని అన్నవరప్పాడు గ్రామానికి చెందిన సరిమెళ్ల సన్నిధి కుటుంబాన్ని తహసీల్దార్ బి. నిర్మల శుక్రవారం పరామర్శించారు. సన్నిధి సంతగుడిపాడు కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల్లో గత ఏడాది 10వ తరగతి చదువుతూ అనారోగ్యానికి గురైంది. అప్పటి నుండి 9 నెలల పాటు అనారోగ్యంతో మృత్యువుతో పోరాడి గురువారం గుంటూరు ప్రభుత్వ వైద్యశాల్లో మృతి చెందింది. తహసీల్దార్ సన్నిధి తల్లిదండ్రులను పరామర్శించారు. సన్నిధి మృతిపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సహాయాన్ని అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ కోటేశ్వరరావు, వీఆర్వో విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. సన్నిధి మృతికి కారణమైన గురుకుల పాఠశాల అధికారులపై చర్యలు తీసుకొని శిక్షించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గోదా బాబురావు డిమాండ్ చేశారు.

చిరుమామిళ్లలో చర్చిప్రహరీ నిర్మాణానికి సాయం



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల: నీ వలె నీ పొరుగు వారిని ప్రేమించు అనే క్రీస్తు సూక్తిని ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల ఛైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ల ఎస్సీ కాలనీలోని సెవెన్‌డే అడ్వెంచర్స్ చర్చి ప్రహరీగోడ నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. నిర్మాణ పనులకు రామిరెడ్డి రూ.10 లక్షల ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు, స్థానిక పెద్దలు మాట్లాడుతూ గతంలో ఎస్సీ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు రామిరెడ్డి అందించిన సాయాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా శాలువాలతో ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో యన్నం శివారెడ్డి, గాదె రమణారెడ్డి, శ్రీనివాస్, స్థానిక సంఘస్తులు, సంఘపెద్దలు పాల్గొన్నారు.

పూజ చేస్తుండగా మహిళకు గాయాలు

ఆస్పత్రికి తరలింపు

నరసరావుపేటటౌన్: పూజ చేస్తుండగా ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సంఘటన శుక్రవారం పట్టణంలోని ఓ అపార్టమెంట్‌లో చోటు చేసుకుంది. ప్రకాష్‌నగర్ శారదాంబ థియేటర్ వెనుక ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఎ.భాగ్యలక్ష్మీ నివాసం ఉంటుంది. ఇంట్లో పూజ చేసుకుంటుండగా కర్పూరం నిప్పు చీరకు అంటుకొని మంటలు వ్యాపించాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మంటలను అదుపు చేశారు. సంఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

నరసరావుపేటటౌన్: వ్యక్తిపై దాడికి పాల్పడ్డ ముగ్గురి యువకులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ హైమారావు శుక్రవారం తెలిపారు. బరంపేటకు చెందిన షేక్ ముస్తఫా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మద్యం దుకాణం వద్ద నిల్చొని ఉండగా వీర్ల చెన్నకేశవరావు, వీర్ల దుర్గారావు, గంధం కార్తిక్‌లు స్వల్ప వివాద నేపథ్యంలో అతనిపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.